క్లుప్తంగా

బీసీ రథాయాత్రను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: బీసీ హక్కుల సంక్షేమమే ధ్యేయంగా డిసెంబర్ ఏడో తేదీన ఇచ్ఛాపురంలో ప్రారంభం కానున్న రథాయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు కొత్తపుట్టుగలో రథాయాత్ర వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 120 నియోజకవర్గాల పరిధిలో జరగనున్న యాత్ర తిరుపతిలో ముగిస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పి.చంద్రపతి, అమిల్లా బేగ్, కాయతి వెంకటరమణ, ఢిల్లీరావు, గాంధీ, సాలిన ప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వీల్ చైర్ వితరణ

టెక్కలి: పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యుడు ఎరుకోల జనార్దనరావు తనవంతు సాయంగా టెక్కలిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం వీల్‌చైర్‌ను వితరణగా శనివారం అందజేశారు. తన భార్య లలితాంబ జ్ఞాపకార్థం సుమారు రూ. పది వేల విలువైన వీల్ చైర్‌ను సమకూర్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు, సభ్యులు జి.వి.రెడ్డి మాస్టారు, జి.మల్లేశ్వరరావు, వైద్యులు శ్రీరాములు, మహరాజ్ పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

మందస: రహదారి నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై సీహెచ్ హరికృష్ణ అన్నారు. మందస పోలీసు స్టేషన్‌లో శనివారం ఆటో, మ్యాజిక్ డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఆటోలు నడపాలన్నారు. పాఠశాల విద్యార్థులను తీసుకెళ్తున్నప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓవర్‌టేక్ చేసేటప్పుడు, సడన్‌గా ఆపాలన్నప్పుడు ముందూ, వెనుకా గమనించాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలను నడపవద్దని కోరారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హైకోర్టు జడ్జిను కలిసిన టెక్కలి న్యాయవాదులు



హైకోర్టు జడ్జి రామకృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

టెక్కలి: ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌ను టెక్కలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు శనివారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆయన్ని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, జిల్లా న్యాయ సేవా అథారిటీ కార్యదర్శి సన్యాసినాయుడు సమక్షంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద నేతృత్వంలో న్యాయవాదులంతా కలిశారు. టెక్కలిలో కోర్టు సముదాయం భవనాల నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈయనతో పాటు న్యాయవాదులు బాలకృష్ణ, డి.రాజేశ్వరరావు, ఎం.గోవింద్, పి.ఆనంద్, వై.సూర్యారావు, పి.రాము ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల పయనం

ఇచ్ఛాపురం: నరసరావుపేటలో ఆదివారం నుంచి జరగనున్న సబ్‌జూనియర్ ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పయనమయ్యారు. వీరి ప్రయాణ ఖర్చుల నిమిత్తం బి.ఎస్.ఎన్.ఎల్. ఏఈ విజయ్‌కుమార్, వ్యాపారవేత్తలు బత్తుల వెంకటరమణ, బత్తిన నాగరాజు, రాజు, రమేష్, నవీన్‌చౌదరిలు ఆర్థిక సాయం చేశారు. రాష్ట్రస్థాయిపోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి

నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల్లో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో నిర్మాణాలు చేస్తున్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గుత్తేదారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాల భవనాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు గుత్తేదారులకు సకాలంలో పనులు రికార్డింగ్ చేసి సూచనలు ఇవ్వాలన్నారు. అన్ని సచివాలయ పరిధిలో నిర్మాణాలు పూర్తి చేసి మండలం అభివృద్ధి పథంలో నడిచేలా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో శివ ప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ సంతోష్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షత తగదు

- అవగాహన కార్యక్రమాల్లో వక్తలు

టెక్కలి: సమాజంలో లింగ వివక్షతకు పాల్పడవద్దని వక్తలు అన్నారు. ఈ మేరకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో టెక్కలిలో శనివారం అవగాహన కల్పించారు. 'అంతర్జాతీయ స్త్రీ హింస' వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి మహిళా సమాఖ్య భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. లింగ వివక్షతకు పాల్పడిన వారిని శిక్షించేందుకు చట్టాలు కఠినతరంగా ఉన్నాయన్నారు. ఆడ, మగ ఇద్దరినీ సమానంగా చూడాలని కోరారు. అనంతరం మానవహారంతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి, వెలుగు ఏసీ శ్రీరాములు, ఏపీఎం నారాయణరావు, ఏపీవో బి.ప్రసాదరావు, వెలుగు సిబ్బంది వరదరాజు, పద్మ, నీలవేణి, సరోజిని, ఆరోగ్య, అంగన్‌వాడీ



మందస: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కంచిలి: మానవహారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ వివక్షలేని సమాజం కావాలి

మందస: సమాజంలో లింగ వివక్షత ఉండకూడదని ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. మందసలో జెండర్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి



వజ్రపుకొత్తూరు రూరల్: ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, మహిళలు



ఇచ్ఛాపురం రూరల్: కొఠారీలో ర్యాలీ చేస్తున్న మహిళలు



టెక్కలి: మానవ హారం చేస్తున్న వెలుగు సిబ్బంది

డిసెంబర్ 22వ తేదీ వరకు పంచాయతీ స్థాయిలో జెండర్‌పై అవగాహన కల్పించాలన్నారు. భయం, వివక్ష, బాల్య వివాహాలు, హింసలేని జీవితం, కొట్టడం, బెదిరించడం ఉండకూడదన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వైకేపీ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సీహెచ్ లక్ష్మణమూర్తి, ఎంఎంఎస్ కోశాధికారి బాలక విజయశ్రీ, ఐసీడీఎస్ సిబ్బంది, వీఓఏ, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

హింసను విడనాడాలి

ఇచ్ఛాపురం రూరల్: జెండర్ ఆధారిత హింసను విడనాడాలని కొఠారీ గ్రామ సర్పంచ్ దుక్క ధనలక్ష్మి పిలుపునిచ్చారు. 'జెండర్ ఆధారిత హింసకు' వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా కొఠారీ గ్రామ సచివాలయం పరిధిలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఏపీఎం సనపల ప్రసాదరావు మాట్లాడుతూ.. బాలల విద్య, వైద్యం, బాల్య వివాహాలపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పిస్తూ నాలుగు వారాల పాటు గ్రామ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మానవ హారం, ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దుక్క ఆనంద్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివక్ష విడనాడాలి

కంచిలి: సమాజంలో ఆడ, మగ అనే లింగ వివక్షను విడనాడాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కంచిలిలో అవగాహన ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు, రక్తహీనత, ఆడ పిల్లలకు విద్య అనే అంశాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, తహసీల్దార్ ఎస్.హైమావతి, ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి, పశువైద్యాధికారిణి టి.శిరీష, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పి.ఉమారాణి పాల్గొన్నారు.

లింగ వివక్షతను రూపుమాపాలి

వజ్రపుకొత్తూరు రూరల్: లింగ వివక్షతతో అనేక మంది హింసకు గురవుతున్నారని.. అలాంటి జెండర్ వివక్షను రూపుమాపాలని జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, ఈవోపీఆర్డీ తిరుపతిరావు, డీటీ గిరిరాజ్, ఏపీఎం జాంబవతి, పలువురు సర్పంచ్‌లు, వీవోలు, సీసీలు, పోలీసులు, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు వద్దు



ఇచ్ఛాపురం రూరల్: అవగాహన కల్పిస్తున్న ఎంఎస్‌కే రాజేశ్వరి

ఇచ్ఛాపురం రూరల్: బాలికలు బాల్య వివాహాలు అనే వలయంలో పడకుండా ఉన్నత చదువులపై దృష్టి సారించాలని మహిళా సంరక్షకురాలు రాజేశ్వరి అన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో బాలికలతో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాలికల ఉన్నత విద్యకు సహకరిస్తున్నారన్నారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనకు కమిటీలు వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.సురేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టరీత్యానేరం

సోంపేట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. బాల్యవివాహాలతో కలగనున్న నష్టాలను తెలియజేస్తూ పలాసపురం గ్రామంలో సర్పంచ్ తడక జోగారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. బారువ, సోంపేట, జింకిభద్ర, బెంకిలి, మామిడిపల్లి, బేసిరామచంద్రాపురం తదితర పంచాయతీల్లో కూడా ర్యాలీలు నిర్వహించారు.



సోంపేట: పలాసపురం ర్యాలీలో జెడ్పీటీసీ సభ్యురాలు యశోద తదితరులు



నందిగాం: ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

బాల్య వివాహాలను అరికడదాం

నందిగాం: లింగ వివక్ష, బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి మండలాన్ని ఆదర్శవంతంగా నిలుపుదామని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనకై గ్రామాల్లో మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం నందిగాంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో వెలుగు ఇన్‌చార్జి ఏపీఎం నీలవేణి, మడపాల తిరుపతిరావు, ఐకేపీ, అంగన్‌వాడీ, పోలీస్ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే అభివృద్ధి

- టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి
- తొలుసూరుపల్లి పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. తొలుసూరుపల్లి పంచాయతీ జయకృష్ణాపురం, ధర్మనీలాపురం, మున్సబుపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడచిన నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతీ కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఇటువంటి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. అనంతరం జయకృష్ణాపురంలో గ్రామంలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను వాణి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ దువ్వాడ హైందవి మోహన్, బి.రామకృష్ణ, ఎస్.గణపతిరావు, ఎస్.రాజశేఖర్, జి.భాను, ఎస్.మల్లేశ్వరరావు, టి.సూర్యం, డి.విజయ్, డి.కూర్మారావు, ఎ.రాహుల్, టి.జగ్గారావు, డి.పోలయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న దువ్వాడ వాణి

చెత్త సేకరణ కేంద్రాలతో సంపద

వజ్రపుకొత్తూరు రూరల్: చెత్త సేకరణ కేంద్రాల నుంచి సంపద సృష్టించాలని పంచాయతీరాజ్ డివిజనల్ అధికారి ఐ.వి.రమణ అన్నారు. గరుడభద్రలోని చెత్త సేకరణ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త సేకరణ కేంద్రాల వినియోగంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయం పొందవచ్చన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చెత్త సేకరణ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అలాగే పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గూడ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది బి.మోహన్, ఆర్.కల్యాణి, వై.అవినాష్, వెంకటేష్, బి.స్వాతి, ఉర్వశి ఉన్నారు.



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐ.వి.రమణ

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన క్రీడా కిట్లను కవిటి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. గ్రామ సచివాలయాల వారీగా క్రీడల్లో మెరుగ్గా రాణించేందుకు వీలుగా కిట్లను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 88 గ్రామ సచివాలయాలతో పాటు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ సచివాలయాల్లో కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, వై.నీలయ్య, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, నీలాచలం, ఎన్ని అశోక్, బర్ల నాగు, నల్లాన శ్రీనివాసరావు, బి.రమేష్ పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

మహిళల హక్కులను కాపాడాలి



మానవహారంలో మహిళలు, అధికారులు

కవిటి: మహిళాశక్తి సంఘటిత శక్తిగా రూపాందాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. కవిటి మహిళాసమాఖ్య భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కుల్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళలు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ పి.నేతాజీ, అధికారులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా త్రినాథ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న త్రినాథ్

ఇచ్ఛాపురం: జాతీయ బీసీ సంక్షేమసంఘం ఇచ్ఛాపురం నియోజకవర్గ అధ్యక్షుడుగా బుద్దెపు త్రినాథ్ ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి తెలిపారు. త్రినాథ్‌కు నియామక పత్రాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిలక సంతోష్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు వెంగళరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అమీరుల్లాబేగ్, బీన ఢిల్లీరావు, పాలిన ప్రసాద్, నర్సునాయుడు పాల్గొన్నారు.

ఈత పోటీ విజేతకు సత్కారం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన గోవిందు బెహరా రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో రెండు పతకాలు సాధించాడు. దీంతో ఆయన్ని ఈదుపురంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులు సత్కరించారు. తిరుపతిలో జరిగిన అంతర్ జూనియర్ కళాశాల అండర్-19 పోటీల్లో 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈత పోటీలో గోవిందు రెండు కాంస్య పతకాలు సాధించాడు. పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి నీలాపు శ్రీను, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు విజేత గోవిందు బెహరా, కోచ్ బత్తుల రామారావును దుశ్శాలువతో సన్మానించారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

- 139 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- 'సాక్షి'తో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమార్



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఎటువంటి టార్గెట్ లేకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం. దీనికోసం ప్రత్యేక చర్యలు చేపట్టాం. 139 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సైతం ఆరంభమైందని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ వెల్లడించారు. టెక్కలి డివిజన్‌లో ధాన్యం కొనుగోలు, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో హుద్‌హుద్ ఇళ్ల కేటాయింపులో లబ్ధిదారుల ఎంపిక, కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు తదితర అంశాలపై 'సాక్షి'తో శనివారం ప్రత్యేకంగా మాట్లాడారు.

–టెక్కలి

సాక్షి: టెక్కలి డివిజన్‌లో ఈ ఏడాది ధాన్యం కొనుగోలు పరిస్థితి?

సబ్ కలెక్టర్: ధాన్యం కొనుగోలు విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొనుగోలు విషయంలో ఎటువంటి టార్గెట్ లేకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలుకు చర్యలు చేపట్టాం. డివిజన్ పరిధిలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, హిరమండలం, ఎల్.ఎన్.పేట, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లోని 139 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ నెల 14వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించాం. రైతులకు అనుకూలంగా జీపీఎస్ సిస్టమ్‌తో రవాణా వాహనాలు, అలాగే లోడింగ్, గోనె సంచులను ఏర్పాటు చేశాం. ధాన్యం కొనుగోలు విషయంలో ఆర్‌బీకేలో ఒకసారి ట్రక్ షీట్ జనరేట్ అయిన వెంటనే ఆయా రైతు ఎక్కడకు తిరగాల్సిన అవసరం లేదు. ధాన్యం మిల్లుకు చేర్చాల్సిన బాధ్యత అధికారులదే.

సాక్షి: కొన్ని మండలాల్లో కుటుంబ సభ్యులందరికీ ఒకేచోట ఓటు హక్కు లేదు. దీనికి ఏం చేయాలి?

సబ్ కలెక్టర్: ఓటు హక్కు నమోదుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇటీవల ప్రకటించిన ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌వోల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నాం. ఓటరు గుర్తింపు కార్డులోని ఫొటోలు, వారి చిరునామాలు సక్రమంగా లేని వారికి ఇప్పటికే సమాచారం అందజేశాం. అంతేకాకుండా విద్యా సంస్థల్లో ఓటు హక్కు వయసు కలిగిన విద్యార్థులకు చెందిన ఓటరు గుర్తింపు కార్డులను సేకరిస్తున్నాం. వీటిలో ఎవరికైనా ఓటు హక్కు లేకపోతే తక్షణమే వారిని ఓటరుగా చేర్చేందుకు ఏర్పాట్లు చేశాం. కొన్ని మండలాల్లో కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు హక్కు లేదని తెలిసింది. దీని కోసం తక్షణమే ఫారం-8తో ఆయా కుటుంబ సభ్యులందరికీ ఒకే చోట ఓటు హక్కు ఉండే విధంగా ఏర్పాట్లు చేశాం. ఓటు హక్కుకు సంబంధించి డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకు అన్ని రకాల దరఖాస్తులు స్వీకరిస్తాం

సాక్షి: టెక్కలి నియోజకవర్గంలో హుద్‌హుద్ ఇళ్ల పరిస్థితి?

సబ్ కలెక్టర్: టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో కొన్ని సంవత్సరాలుగా హుద్‌హుద్ ఇళ్లు లబ్ధిదారులెవరికీ మంజూరు చేయలేదు. మొత్తం 558 హుద్‌హుద్ ఇళ్లు ఉన్నాయి. మొదటి విడతగా 241 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా టెక్కలి మండలానికి సంబంధించి మొదటి విడతగా 90 ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తున్నాం. ఈ నెల 30వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో టెక్కలి మండలం లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తున్నాం. నియోజకవర్గంలో ఆయా మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

సంక్షిప్తంగా...

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్



మాక్‌పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కవిటి: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని రాజపురం ఏపీమోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. వాస్తవంగా నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాల్సి ఉండగా..ఆ రోజున కావడంతో ముందస్తుగా జరుపుకున్నారు. లోక్‌సభలో స్పీకర్ బాధ్యతలు, విధులు, ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్, బడ్జెట్ సమర్పణ, సభ నిర్వహణలో ఉన్న పలు విధానాలపై విద్యార్థుల ప్రదర్శన అలరించింది. రాజ్యాంగం ప్రాధాన్యతను ఎంఈవో ధనంజయమజ్జి వివరించారు. లెక్చరర్లు అరసాడ బాబూరావు, శంకా రమేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం

టెక్కలి: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన క్యాడెట్లు శనివారం రక్తదానం చేశారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్‌సీసీ 14 బెటాలియన్ సుబేదార్ దల్‌బీర్ సింగ్ నేతృత్వంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ ఎస్.టి.శివప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి టి.మురళీమోహన్ పాల్గొన్నారు.

ఆవు కడుపులో గోనెసంచి

కోటబొమ్మాళి: ప్రాణాపాయంలో ఉన్న ఆవును కురుడు పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ రక్షించారు. ఎలమంచిలిలో వైకుంఠరావుకు చెందిన పాడి ఆవు వారం రోజులుగా మేత తినడం లేదు. సమస్యను పశువైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్‌కు వివరించడంతో శనివారం ఆవును పరీక్షించగా వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు.

ప్రభుత్వ పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ

కాశీబుగ్గ: జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్య పరచి భాగస్వామ్యం చేసే కార్యక్రమం నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 17వవార్డు సాయికాలనీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల 69వ పోలింగ్ స్టేషన్ వద్ద ఈ మేరకు శనివారం ప్రతిజ్ఞను చేయించారు. యువ ఓటర్లచే బూత్ లెవెల్ ఆఫీసర్ సంపతిరావు, కన్నాకుమారి ప్రతిజ్ఞ చేయించారు.

వచ్చేనెల 22న పాణిగ్రాహి వర్ధంతి సభ

పలాస: శ్రీకాకుళం సాయుధ పోరాట యోధుడు, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సభను విజయవంతం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మార్పు మల్లేశ్వరరావు, ప్రజాకళా మండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి కోరారు. డిసెంబర్ 22వ తేదీన బొడ్డపాడులో పాణిగ్రాహి 54వ వర్ధంతి సభ ఉంటుందన్నారు.

పవనపుత్ర సేవాసంస్థ సాయం

మందస: భేతాళపురం గ్రామానికి చెందిన బైపల్లి సూర్య బెంగళూరులో మరణించారు. ఆయన భార్య గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. ఇద్దరు కుమార్తెలతో కుటుంబ నడవడం కష్టంగా ఉండడంతో పవనపుత్ర సేవాసంస్థ స్పందించింది. బాధిత కుటుంబానికి రూ.45 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేసింది.

పరామర్శ

కోటబొమ్మాళి: కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దుబ్బ రమేష్ గుండె పోటుతో మరణించారు. దీంతో అతని కుటుంబ సభ్యులను కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పరామర్శించారు.

ఐటీఐలో ప్రవేశానికి రేపటి వరకు గడువు

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితిష్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో నిర్వహించే స్వల్ప కాలిక కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 27వ తేదీతో గడువు ముగియనుంది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ పైల జవహర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 63010 46329 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి

పలాస: బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

బారువ కళాశాలకు సీ–గ్రేడ్

సోంపేట: బారువ కళాశాలకు నాక్ కమిటీ 1.6 పాయింట్లతో సీ–గ్రేడ్ ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ తెలిపారు. 42 సంవత్సరాలు చరిత్ర కలిగిన కళాశాలకు సీ–గ్రేడ్ ప్రకటించడంతో ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ, పూర్వపు ప్రిన్సిపాల్ సలీంబాషాను గ్రామస్తులు, పూర్వవిద్యార్థులు అభినందించారు.